# అప్రాప్తరూపుడి ప్రాప్తి

కె. రామలక్ష్మి

వీధి తలుపు తీయబోతున్నాడు రామం. అప్పుడే వంట యింటిలోనుంచి వచ్చింది అమ్మ-ఆ గొంతులో ఆత్రుతా, అనురాగం వెల్లివిరుస్తున్నాయి..."ఏరా రామం?"

అంతే. తలుపుగడియ తీయబోతున్న రామం అలాగే ఆగి వెనక్కి చూశాడు. ఆ క్షణాలో రామానికి ప్రపంచం అంటేనే విరక్తి కల్గింది. ఈ జీవితాన్ని యింతటితో చాలించి మళ్ళీ, అంటే అంతా కొత్తగా; తనకి నచ్చినట్లు; మళ్ళీ మొదలెడితేనో! జీవితం అంతానూ - పేరూ, ఊరూ మార్చి, తనని వెన్నంటే స్మృతుల్ని గాలుల్లో వెదజల్లేసి, కిందితరగతి వాణ్ణని తనుపడ్డ కించత్వాన్నీ(కించత్వానికి తానర్హుడనని అనుకుంటూనే!) అందరికంటే యేదో విధంగా తాను తక్కువవాడనని పడ్డబాధనీ. యీ ప్రపంచంలో ప్రతి విషయాన్నీ ఎంతో తీవ్రంగానూ, జీవితానికి సుఖమే లేకుండానూ, తీసుకుంటే మనిషి రోగిష్టి అవక ఏమవుతాడని? తనలోనే తను నవ్వుకున్నాడు రామం. పుట్టింది మొదలు ఈనాటివరకూ ఒకవిషయం తనకి తెలుసు. తన ముఖబింబాన్ని చూసి మానవలోకం నవ్వుకుందనీ, అట్లాంటి ముఖం తనకి లేనందుకావం దించిందనీ. తెలిసే-బతికి తిరుగుతున్నానంటే, ఆశ్చర్యపోయాడు రామం. అందుకే పాపం అమ్మ! అమ్మ అమ్మ కనుకనే తనని హృదయ నేత్రంతో చూసి ప్రేమించింది. అందుకే ఏదోవిధంగా తననిగురించి అమ్మ నిరంతరాందోళనకి గురి అవుతూనే వుంది.

వెనక్కి చూశాడు. కాని అమ్మకేనా తనముఖం చూపకూడదనుకున్నాడు. వెనక్కి తిరగనే కూడదని ముఖం తిప్పేసుకున్నాడు. అమ్మ చెప్పతలుచుకున్నదేమిటో తాను వినదల్చుకో లేదు. అవును. ఆవిడేం చెపుతుందో తనకి తెలుసు. "రామం, నాయనా! మంచిగాబతకరా!"అంటుంటేనే ఆవిడగొంతు ఒణకడం మొదలెట్టి కళ్లుచెమ్మగిల్లుతాయి. "ఏమిటి ఉపయోగం? మంచిగా బతుకుతే ఏం తృప్తి?" ప్రశ్నలు కురిపించుతుంది తన ఆత్మ. పొద్దుట తను విన్న అమ్మాయిల నవ్వూ, చూసిన చెవులుకొరుక్కోడాలూ హఠాత్తుగా జ్ఞాపకం వచ్చాయి. జీవితంలో ఏవ్యక్తైనా సరే. వేసే ప్రతీఅడుగులోనూ ఇలాంటి అవమానాల్ని ఎలా భరించడం? భరించగలిగే తత్వం అలవరచుకొనే దాకా అలాంటివాళ్ల కళ్లల్లోపడకుండా వుంటేసరి!

సాయంత్రం భాస్కరంఅన్నమాటలు చెవుల్లో గింగురుమన్నాయి...తనూ ఒక వ్యక్తినని అందరితోటీ మాటాడాడు. ఫలితంగా అందరూ హేళనచేశారు. ఏం తనకి హక్కులేదూ? అందరితోపాటూ తనుకూడా హైమ బాగుందనిఅంటే వేళాకోళం దేనికి?

"కొంపతీసి ఆవిడని ప్రేమించడం లేదుకద?" అన్న మూర్తి మాటా—

"దానికేంరా? ఆవిడ వింతతత్వానికీ వాడి సౌందర్యానికీ జత కలుస్తుందిలే" అన్న భాస్కరం సమాధానం. ఏమిటి వాడి ఉద్దేశం? అవును యిలాంటివ్యధ కలిగించే సందర్భాల కవకాశంలేకుండా చేసుకుంటే బెడదలేదు. అవును — సమానత్వం ఆపా

స్కెచ్

దించి మాటాడగలిగేమనుషులు లేనప్పుడు వాళ్ళ సాంగత్యం వర్జిస్తేసరి.

తత్ఫలితంగానే రామం బాగా చీకటిపడి, అంతా ప్రశాంతంగా నాల్గుగోడల నడుమా విశ్ర మించే సమయంలో తను స్వేచ్ఛా వాయువుల్ని పీల్చేందుకు బయలుదేరే అలవాటు చేసుకున్నాడు.

ఒకచేత్తో తలుపు తేరుస్తూనే "ఎందుకమ్మా అలా బాధపడతావు? ఇదవుతావు? ఓసారి అలా తిరిగివస్తాను. అంతేగా. ఓసారేనా యిటూ అటూ తిరగకపోతే ఎలాగమ్మా? ఇలాగే అవతలి కెడతాననేప్పటికి నువ్వుబాధపడే అవసరంలేదు. రాత్రయితేనేం? పగలయితేనేం?"

"నువ్వు దేనికో బాధపడుతున్నావురా?" అంది అమ్మ. "దేనికి? ఏంకావాలి? అస్తమానం ఏదోలావుండిపోతే ఎలాగరా?"

"అలా ఏదోలా వుండడం నాకు స్వభావ సిద్ధంగానే వుందమ్మా" అంటూ గడియతీశాడు రామం. చల్లగాలి ఒక్కసారి విజృభించి యిల్లంతా కమ్ముకొంది. తలనెరిసిన ముసలితల్లి- అమ్మ. యిప్పటికి ఆవిడని పెట్టినక్షోభచాలు- రోజూరాత్రి బయటతిరగడానికి వెళ్ళడం, రాత్రి రెండూరెండున్నరకి యిల్లుచేరడం, తనకోసం కిటికీలోంచి చూస్తూ కూర్చునే అమ్మని ఎందు కమ్మా అని మందలించడం-యిలాగ ఎన్నాళ్లు?

"ఒరే రామం కాలేజీలోచేరి ఇంకో డిగ్రీకి చదువుకుంటావురా?" ఎంతో అభిమానంతో అమ్మ అడిగింది.

"ఎందుకమ్మా,సంపాదించిన డిగ్రీ చాలు. పని చేసుకుందుకు నాకేం అభ్యంతరాలు లేవమ్మా. బాగానే వుంటుంది. సరిఅయినది దొరకాలా? అప్పటిదాకా యిలా కాస్సేపు తిరిగిరావాలి. ఎంతసేపు కూర్చొని ఎంతని చదవను?- నేం చదవ వలసింది యింకలేదమ్మా."

"రామం! ఓ మంచిపిల్లనుచూచి నీ మెడకి కట్టేస్తాను. అప్పుడే నీ యీ అర్థరాత్రి తిరుగుళ్లు మానేస్తావేమో!"

రామానికి ఒక్కసారి ఒళ్లు ఝల్లుమంది. అమ్మ చెప్పింది ఒక మంచిమార్గంగానే తోచినది.... అవును - జీవితాన్ని జరిగినదాకా తుడిచేసి మళ్ళీ మొదలుపెట్టేశక్తి అలాంటి మార్గం సాధ్యం కాదు... అందుకే అమ్మమీద విపరీతమైన ఆగ్రహం వచ్చింది - దాంతోపాటే తనమీద అసహ్యంకూడా.

"అమ్మా! నన్ను నేను పెట్టుకొనే బాధకితోడు నువ్వుకూడా బాధపెడితే ఎలాగమ్మా" మృదువు గానే కోప్పడ్డట్టు అన్నాడు. వీధిలో చల్లగాలికి రామం లాల్చీకొసలు ఎగురుతున్నాయి. ఆ చల్ల గాలికి అమ్మ తన కొంగు యింకా దగ్గిరగా లాక్కొంది.

"నీదారికడ్డం నేను నించోనురా రామం. నీకు పెళ్ళిచేసుకోవాలని వుంటే ఆదారిచూడు. నీకు నేంతప్పు ఎవరున్నారురా?"

"అబ్బబ్బ. వూరుకుందూ అమ్మా, పెళ్ళిచేసు కొందుకు-అందులోనూ నన్ను- ఎవరుంటారమ్మా సిద్ధంగా? నాకు తెలిసినపిల్లలుకూడా ఎక్కడా లేరు."

"అలా అనకురా. ఇప్పుడే ఇలా వైరాగ్యం వస్తే ఎలాగ?-ఇంకానువ్వు పసివాడివిరా బాబూ పసివాడివి."

"అవును - పాతికనిండిన పసివాణ్ణే" అన్నాడు రామం. వీధితలుపు రెండురెక్కలూ బార్లా తెరి చాడు. చలిగాలి ముఖానికి కొట్టింది.

"వయస్సులో ఏముందిరా, నా ప్రాణానికి నువ్వు పసివాడివే కాదురా?"

"సరేగాని, తలుపేసుకొని పడుకో అమ్మా, కాస్సేపలాతిరిగి యిప్పుడే వచ్చేస్తాను" రామం ఓ అడుగు అవతలికి వేశాడు.

"అవునుకానీ ఒక్కడివీ, ఎంతసేపని ఎక్కడ తిరుగుతావు?" అమ్మకి సమాధానం చెప్పేసరికి నిజంగా విసుగే వస్తుంది. "ఏముందమ్మా, నాలుగురోడ్లూ కలియ తిరుగుతాను. జేబులో డబ్బులుంటే పదణాల క్యూలో నిలుచుని ఓ టికట్టు సంపాదించి సినిమా చూసివస్తాను. లేకుంటే, అలాతిరిగేసి వచ్చేస్తాను"—హఠాత్తుగా ఆగిపోయాడు రామం. రోజు తరవాత రోజు, వారాలూ, నెలలూ, సంవత్సరాలూ యిలాగే ఎలా గడిచిపోతున్నాయి? తనకే అర్థం కాలేదు. యీ చక్రం ఆపేమార్గం ఎందుకు ఆలోచించ లేదు తను?-ఈ ప్రపంచంలో ఎంతోమంది తన లాగే ముఖం ఎత్తుకొని తిరగలేనివాళ్ళు తనలాగే

న్యూనత పడేవాళ్లు-అయినా, ఏదో రీతిగా ధైర్యం తెచ్చుకున్నవాళ్ళు ఎందరున్నారో? ఎక్కడేనా కురూపి ఫోటో చూస్తే తన కేదో అవ్యక్తానందం-ప్రపంచంలో తను ఒంటరిగాలేననీ, తోడువున్నారనీ తృప్తి. ఆమాటకొస్తే అందాన్ని కొరుక్కుతింటామా ఏమిటి? అందగాళ్లు నిజానికి ఎక్కువ ప్రాముఖ్యం వహించనేలేరు. ఎటొచ్చీ దుర్బలహృదయులైన ఆడవారిదృష్టిని ఆకర్షిస్తారు. -అంతేగా!

"ఏం విపరీతం కాదమ్మా యిది. ప్రతి సంవత్సరం యీ టైములో యిలాగే వుంటోంది. అయినా దానిలో వింత కనిపించదు నాకు."

"రామం, ఇంటిగౌరవం నిలపెట్టు నాయనా! మంచి పిల్లని చూసి హాయిగా పెళ్ళాడు. నీ యిష్టంవచ్చిన అమ్మాయిని చూసుకో-నే అభ్యంతరం పెడితే అడుగు!"

జీవితంలో తిరిగి ఒక వసంతం తొంగిచూసి వెళ్ళింది అనుకున్నాడు రామం.

"నాకెవరూ మంచి పిల్లలు తెలియరమ్మా! తెలిసినా వాళ్ళకి నేను నచ్చను." మాట్లాడుతూంటే తనకే నవ్వు వచ్చింది. ఉత్తి చేతకానివాడిలా మాట్లాడుతున్నానా ఏం? అనుకున్నాడు. తనని చూసి ఎవరూ యిష్టపడరు. ఈ ప్రపంచంలో తాను ఏకాకి.

"సరేలే అమ్మా! తలుపేసుకు పడుకో! ఓ గంటలో వచ్చేస్తాను" అంటూ మళ్ళీ వెనుతిరిగి చూడకుండా వీధిలోకి వెళ్ళిపోయాడు రామం.

...తనని చూసి తనకోసం బాధపడే తల్లిని చూసీ నవ్వుకుందాం అనుకున్నాడు రామం. కాని నవ్వురాలేకపోయాడు- అందులో ఏమీ హాస్యం తోచలేదు. వీధిలో పోతూన్న రామానికి తెలుసు-తల్లి అలా కిటికీలోంచి తన కోసం చూస్తూవుంటుందని. అలా తను ఏదో బాధపడుతున్నాడని తనూ బాధపడుతూనే వుంటుంది పాపం! అమ్మ ముసలిదైపోతూన్న కొద్దీ విశ్రాంతికిబదులు ఆరాటం హెచ్చుతోంది. జీవితంలో ఒకప్పుడు ప్రేమా అభిమానం అంటే ఏమిటో ఆమెకి తెలుసు-తత్ఫలితమే తను.

మేఘాలులేని ఆకాశం నక్షత్రాలలో నిండి ఏదో భావగాంభీర్యంలో మునిగినట్టూ విషాదపూరితంగా వున్నట్టూ వికృతంగావుంది. ఆకాశం కేసీ దానిలోని నక్షత్రాల కేసి చూస్తూ నడుస్తూంటే- ఘనశ్యాంతి. ఆ ఆకాశంకింద తను ఓ నలుసు. అందరూ అంతే. ఒకళ్ళకి ఒకళ్లు తోడువున్న వాళ్ళూ, జీవితంలో ప్రాముఖ్యం వహించినవాళ్ళూ - అందరుకూడా నిర్మలమైన ఆకాశంకింద అణుమాత్రులే. ఏదో అర్థంలేని తాపత్రయంతో అంతులేని ఆరాటంతో, కారణం లేని భయంతో ఒణికే మానవమాత్రులు. వినీలాకాశంకింద పెద్ద పట్టణాలూ చిన్న ఆటస్థలాలే- అవి గర్వించే విషయాలూ, మానవులు చెప్పే నాగరికతా జాతి సౌభాగ్యాలూ,...అన్నీకూడా చుంచుల్లాగ, భయపడుతూ సహాయాన్ని అర్థిస్తూ...ఒకదాని పొత్తిళ్ళకోసం యింకోటి తహతహలాడుతూనే వుంటాయి. ఎవరో కంటె తాను అందవిహీనుణ్ణని తెలిసినా, యిప్పుడేమంత బాధగాలేదు. అందరూ వికారులే. మానవుడికి ఉండాలన్న సౌశీల్యం, ఉండదగ్గ సౌశీల్యం ఏ ఒక్కరిలోనూ లేదు. అందరూ, ఏదో ఒకరకంగా ఆకృతి చెడ్డవారే. అందమైన ఆకృతివుంటే- ఆత్మసంస్కృతి వుండదు; మేధస్సంపత్తివుంటే- హృదయం వుండదు-మానవత్వం వుండదు. సాధారణంగా ఒక సుగుణంవుంటే, ఒక దుర్గుణం లేకున్నా, యింకో సుగుణం లోపిస్తుంది.

అందమైన అమ్మాయి ఎదురొస్తోంది. ఇంత రాత్రివేళ, ఒంటరిగా ఎక్కడినుంచి ఎక్కడికి వెళుతోందో! వస్తూంటే ఆమెనే తదేకధ్యానంతో చూస్తున్నాడు రామం: అందమైన విగ్రహం, దానికితగ్గ తీరైన నడకా...దానికడ్డుగా నిలుస్తే? ఒక్కక్షణం-యీ ప్రబలమైన కోర్కెని అరికట్టలే ననుకున్నాడు. శరీరం ఒక్కసారి కంపించింది ఆమె మరీ దగ్గిరకి రావడంతో. హృదయం ఏదో బాధతో నిండింది. కాని తన మీద తనకే అసహ్యంవేసింది-తన పరిస్థితి ఎంత విషాదపూరితం! తనగతి ఎంత నిస్సహాయం! మెడ తిప్పైనా చూడలేదు-ఆ అందమైన అమ్మాయి. అక్కడ ఆ రోడ్డుమీద తనున్నట్టే తెలియదేమో ఆమెకి! లక్ష్యపెట్టకపోడంతో ఆమె అంటే మరీ కంపించింది అతని హృదయం. "అలాంటివాళ్లు ఒక్కళ్లు నా హృదయాన్ని అర్థం

చేసుకోకలిగితే ఎంత మనశ్శాంతి!"అనుకున్నాడు రామం."అందమూ ఆదరణా అంతటావుంటాయి-కొంచంవున్నా తృప్తినిస్తుందనుకున్న చోటతప్ప" ఆలోచిస్తూనే నడుస్తున్నాడు రామం. అనురాగం కోసం తహతహేగాని అది దొరకదు. ఎప్పుడూ ఆదరణకోసం ఎదురుచూట్టమే కాని, ఆదరణని ఆదరణతో పంచుకుందుకు ఎదురుచూడ్డానికి వ్యవధే లేదు.

..."పాతికేళ్లూ నిండిన పసివాణ్ణి" నవ్వుకున్నాడు రామం. శూన్యంలోకి ఎగురుచూసే చిన్న జంతువు. కీర్తికోసం అర్రులుచాచే ప్రాణి. ఆఫీసులో క్లర్కు..."ఆ అందమైన అమ్మాయి ఎవరిని పెండ్లాడుతుందో" వూహించి చూశాడు రామం. "వెడుతున్నాడో వస్తున్నాడో తెలియని ఓ జంతువునేమో. అన్నీవుండి అర్థం చేసుకోలేని వాణ్ణేమో" తన వూహకి తనకే నవ్వొచ్చింది.

నడిచినడిచి చాలాదూరం వచ్చేశాడు. మళ్ళీ వెనకముఖం పట్టాలి. ...ఎక్కడికీ తిన్నగా తీసుకెళ్లని రోడ్లు. ఒకరోడ్డు యింకో దాంట్లోకి కలుస్తుందే గాని గమ్యం చేరదు. విసుక్కున్నాడు రామం. మార్కెట్టు రోడ్డుదాటి పక్క వీధిలో నుంచి యింటి ముఖంపట్టాడు...

రామానికి తెలుసు అమ్మ కిటికీలోంచి చూస్తూ వుంటుందని —"ఎక్కడకు వెళ్ళావురా రామం" అంటూ అడుగుతుందని. "రామం బాగా రాత్రయిందిరా పోయి పడుకో" అంటూ హాలులో దీపం ఆర్పింది తల్లి. ఎందుకో ఆమె ముఖంమీద చిన్న చిరునవ్వు. అదిచూస్తే తనకి పరితృప్తి.

"రామం పోయిపడుకో. ఏమిటో నిన్ను చూస్తే బెంగగా వుందిరా!"

"ఏం లేదమ్మా!" రామానికి తెలుసు తల్లి దేన్ని గురించి బాధపడుతోందో. నవ్వుతూ తలఊపేసు. "అలాఎక్కడికీ వెళ్లలేదమ్మా. ఉట్టినేతిరిగివచ్చాను"

"ఏమోరా!" విచారంగానే అంది తల్లి.

తన సమాధానంతల్చుకుంటే ఆశ్చర్యం. ఏమీ లేదేమిటి?అసందర్భం - అవ్యక్తం - ఆందోళనా పూరితం—ఏవేవో యిదిగా వుంటే ఏమీ లేదేమిటి? పడకలో తలదూర్చి రామం తీవ్రంగా ఆలోచించాడు.—ఏమేనా పెద్దది - తరగని పుస్తకం చదువుతే! చదవడం మొదలెడితే! అలాంటిది ఎవరేనా రాశారా?... భారతం చదవడం తప్ప గత్యంతరంలేదు. అదే తరగనిది. ఎంతగొడ్డుపోయింది యీ ప్రపంచం! చదివితే ఆనందం యిచ్చే పుస్తకమేనా దొరకదా?" అనుకుంటూనే నిద్రపోయాడు రామం-ఉద్రిక్త జీవనవాంఛల యువకుడు.

---

అందుబాటులో ఉన్న ఆధునిక విజ్ఞానంతో—

# గుండెధైర్యం తెచ్చుకోండి!

శశిభూషణ్ పాత్రో

హృదయస్పందనం ఆగిపోగానే, మనిషి చచ్చిపోయాడని మనం భావిస్తాం. భావించటం ఏమిటి-నిజంగానే చచ్చిపోతాడు. గాని షికాగో హాస్పిటల్‌లో అరవై అయిదు సంవత్సరాల వృద్ధునకు ఊపిరితిత్తులు (Lungs) ఆపరేట్ చేస్తున్నప్పుడు రమారమి ఎనిమిది నిమిషాలవరకూ హృదయ స్పందనం ఆగిపోయింది. అంటే ఎనిమిది నిమిషాలవరకు అతను మృత్యావస్థలో వున్నాడు. తరవాత మళ్ళీ గుండెకొట్టుకో నారంభించింది.

ఇలాగే "కాలిఫోర్నియా"లో నున్న ఎల్‌మోండే నివాసియైన "మెల్విన్‌హేవిట్" అనే ఇరవై ఎనిమిది సంవత్సరాల యువకుడు ఎత్తయిన స్థలం నుండి క్రిందికిపడి, తలమీద పెద్ద గాయం తగిలి మరణించాడు. పది నిమిషాల తరవాత గుండె కొట్టుకోసాగింది. ఇంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఇది—"బోస్టన్" సిటీ హాస్పిటల్‌లో అరవైమూడు సంవత్సరాలవృద్ధుడు ఒకడు మరణించాడు. ఇరవై అయిదు నిమిషాల వరకూ అతని హృదయగతి (motion) ఆగి